క్లుప్తంగా

ఫీజులు నియంత్రించాలని డీఈవోకు వినతి



డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

విశాఖ విద్య: ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యజమానులు ఇష్టానుసారంగా పెంచుతున్న ఫీజులను నియంత్రించాలని కోరుతూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ ముందస్తు అడ్మిషన్లు నిర్వహించడంతోపాటు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. వేసవి సెలవుల్లో కూడా బ్రిడ్జ్ కోర్సు పేరుతో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో స్కూళ్ల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.శేఖర్, ఉపాధ్యక్షుడు కె.కిరణ్, నాయకుడు శంకర్ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలపై వినతుల స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

గాజువాక: విద్యుత్ వినియోగదారుల సమస్యలు, పరిష్కారంపై ఈపీడీసీఎల్ జోన్–2 అధికారులు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) ఆధ్వర్యంలో గాజువాక సెక్షన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వేదిక చైర్మన్ బి.సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్ వినియోగదారులతో నేరుగా మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, మీటర్లలో లోపాలు, కాలిపోయిన మీటర్లు, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, సర్వీస్ లోపాలు, కనెక్షన్ల మార్పు, కొత్త కనెక్షన్ల జారీలో జాప్యం, రీకనెక్షన్ సమస్యలు, బిల్లుల్లో తప్పులపై ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పరిష్కారం కాని సమస్యలపై వివరణ ఇచ్చారు. వినియోగదారులకు సత్వర సేవలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, వినియోగదారులు నేరుగా సీజీఆర్‌ఎఫ్‌కు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ వింగ్ సభ్యులు సులేఖరాణి, ఫైనాన్స్ సభ్యుడు ఎస్.సుబ్బారావు, ఇండిపెండెంట్ సభ్యుడు ఎస్.మురళీకృష్ణ, ఈఈ బి.కె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు

విశాఖ విద్య: పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూజీ, పీజీ పరీక్షల్లో కొంతమంది విద్యార్థులు అనైతికమైన చర్యలకు పాల్పడటం, మాల్ ప్రాక్టీస్ చేసినట్లు వర్సిటీ అధికారుల దృష్టికి వచ్చిందన్నారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏయూ పరీక్షలకు సంబంధించిన నియమావళికి అనుగుణంగా త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. ఏయూ పరిధిలో కొద్ది రోజులుగా జరుగుతున్న పరీక్షలను ప్రత్యేకంగా నియమించిన తనిఖీ బృందాలు, ప్రత్యేక పరిశీలకులు నిరంతరం పర్యవేక్షణ, పరిశీలన చేసి పరీక్షా కేంద్రాల్లో కొంతమంది విద్యార్థులు చీటీలు పెట్టి రాయడం, పుస్తకాల్లో చూసి రాయడం, మొబైల్ ఫోన్‌లో చూసి రాయడం వంటి చర్యలకు పాల్పడడాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఇటువంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పరీక్షల విభాగానికి వీరిపై నివేదికను పరీక్షల తనిఖీ అధికారులు పంపారు. మాల్ ప్రాక్టీస్‌కి పాల్పడిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన విద్యార్థుల పరీక్షను రద్దు చేయడం, నిర్దిష్ట కాలం పాటు వారు పరీక్ష రాయకుండా నిషేధించడం, ఇటువంటి చర్యలను ప్రోత్సహించిన కళాశాల యాజమాన్యం, సిబ్బంది పైన క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.



బాజీ జంక్షన్ అన్న క్యాంటీన్‌కు ఆలస్యంగా వచ్చిన భోజనం

ఇలాగేనా నిర్వహణ!



అన్న క్యాంటీన్ బయట ఎండలో వేచి ఉన్న వృద్ధులు

- అన్న క్యాంటీన్‌లో ఆకలి కేకలు
- సమయానికి సరఫరా కాని భోజనం
- మండుటెండలో వృద్ధుల పడిగాపులు
- నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు



క్యాన్లు మోస్తున్న భోజనం చేయడానికి వచ్చిన వ్యక్తులు



ఎండలో నిలబడలేక సమీపంలోని పశువుల ఆస్పత్రి చెట్టు వద్ద ఇలా..

విశాఖ విద్య: నగరంలోని అన్న క్యాంటీన్ల వద్ద ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. సకాలంలో ఆహార పదార్థాలు సరఫరా కాకపోవడంతో తినేందుకు వస్తున్న వారు పడిగాపులు కాస్తున్నారు. గోపాలపట్నం మండలం బాజీ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో శుక్రవారం ఇలాంటి దృశ్యాలే కనిపించాయి. అన్న క్యాంటీన్‌లో ప్రతీ రోజూ ఉదయం అల్పాహారం 7 నుంచి 9 గంటల మధ్యలో పెట్టాల్సి ఉంది. మధ్యాహ్న భోజనం 12 గంటల నుంచి 2.30 వరకు, అదే విధంగా రాత్రి భోజనం 7 నుంచి 8.30 గంటల వరకు పెట్టాలని అధికారులు నిర్దేశించారు. పశ్చిమ నియోజకవర్గంలోని అన్న క్యాంటీన్ల వద్ద సమయపాలన పాటించటం లేదని పలువురు అంటున్నారు. బిర్లా జంక్షన్ ఏరియాలో ఆహార పదార్థాలు తయారు చేసి అక్కడ నుంచి అన్న క్యాంటీన్లకు సరఫరా చేస్తున్నారని, అందువల్లే ఒక్కోసారి ఆలస్యమవుతోందని క్యాంటీన్‌లో పనిచేసే ఓ వ్యక్తి తెలిపాడు. అన్న క్యాంటీన్ నిర్వహణను అధికారులు పూర్తిగా గాలికొదిలేశారని, అందువల్లే సమస్యలు తాండవిస్తున్నాయని పలువురు చెబుతున్నారు.

చులకనేల!

పేదోడికి రూ.5కే భోజనం పెడుతున్నామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. అయితే అన్న క్యాంటీన్లలో ఏం జరుగుతుందనే వాస్తవాలను తెలుసుకోకపోవడంతో వీటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. రూ.5కే కడుపునిండా పెట్టేయాలా..? అంటూ క్యాంటీన్‌లోని సిబ్బంది తినేవారిని చులకన చేస్తూ, రెండో సారి అడిగినా అన్నం, కూరలు పెట్టడం లేదని పలువురు వాపోతున్నారు.

సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు

మల్కాపురం: స్థానిక గౌరీ సేవా సంఘం (హైస్కూల్ రోడ్డు) ఆధ్వర్యంలో సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ 35వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు పేద మహిళలకు వస్త్రాలను పంపిణీ చేశారు. గౌరీసేవా సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన చందనం అరగదీత

సింహాచలం: సింహగిరిపై రెండో విడత చందనం అరగదీత శుక్రవారంతో ముగిసింది. ఈనెల 12న వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి సమర్పించే మూడు మణుగుల పచ్చి చందనాన్ని (సుమారు 125కిలోలు) సమకూర్చేందుకు ఈనెల 7వతేదీ నుంచి అరగదీత ప్రారంభించిన విషయం తెలిసిందే. మూడురోజుల్లోనే మొత్తం కావాల్సిన చందనాన్ని సిబ్బంది అరగదీశారు. ఈనెల 12న చందనాన్ని స్వామికి సమర్పిస్తారు.

మొక్కుబడిగా చలివేంద్రాలు..



మర్రిపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డులో సిబ్బంది లేని చలివేంద్రం



ఆర్‌అండ్‌బీ కార్యాలయం వద్ద నీరు పోసే వారు లేని చలివేంద్రం

విశాఖ విద్య: ప్రయాణికులు, పాదచారుల దాహార్తి తీర్చేందుకు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. గోపాలపట్నం మండలంలో ప్రయాణికులు వేచి ఉండే చోట వారు దప్పిక తీర్చుకునేందుకు వీలుగా చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. అవసమైన వారికి నీటిని అందించేలా సిబ్బందిని అందుబాటులో ఉంచారు. కానీ ఎన్‌ఏడీ చుట్టుపక్కల ఉన్న చలివేంద్రాల్లో మధ్యాహ్నం వేళ తాగునీరు పోసేందుకు సిబ్బంది ఉండడం లేదు.రోడ్డుపై రయ్ మంటూ వాహనాలపై వస్తున్న ప్రయాణికులు చలివేంద్రాల వద్ద తాగునీటి కోసం ఆగినా, అక్కడ ఎవరూ లేకపోవడంతో దాహం తీర్చుకోకుండానే ముందుకు సాగిపోతున్నారు. మరికొంతమంది వారే డ్రమ్ముల్లో నీటిని తీసుకొని తాగుతున్నారు. చలివేంద్రాలు ప్రచారం కోసమని కాకుండా ఎండా కాలం ముగిసేంత వరకు సక్రమంగా నడిచేలా జీవీఎంసీ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పత్రికా స్వేచ్ఛను హరించొద్దు

- 'సాక్షి' పత్రికపై కుట్రలు మానుకోవాలి
- ఎడిటర్ ధనంజయ రెడ్డి ఇంట్లో సోదాలు కక్షపూరితమే
- పశ్చిమ నియోజకవర్గంలో జర్నలిస్టుల నిరసన గళం



గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు



డిప్యూటీ తహసీల్దార్ సువర్ణకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

విశాఖ విద్య: సాక్షి దిన పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో పోలీసులు అక్రమంగా సోదాలు నిర్వహించడాన్ని జర్నలిస్టులు తప్పుబట్టారు. పత్రికా స్వేచ్ఛను హరించేలా పోలీసులు వ్యవహరించడం సరైంది కాదని, ఇది కుట్రలో భాగంగానే జరిగినట్లు భావించాల్సి ఉంటుందని జర్నలిస్టులు గొంతెత్తి నిలదీశారు. జర్నలిస్టుల సంఘాల పిలుపు మేరకు శుక్రవారం గోపాలపట్నం, ములగాడ తహసీల్దార్ కార్యాలయాల వద్ద శాంతియుత నిరసన తెలిపారు. సాక్షి ఎడిటర్ ధనంజయ రెడ్డిపై పోలీసులు వ్యవహరించిన తీరును వ్యతిరేకిస్తూ, ఇలాంటివి భవిష్యత్‌లో చోటుచేసుకోకుండా ప్రభుత్వం స్పష్టమైన వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. గోపాలపట్నం డీటీ సువర్ణకు వినతి పత్రం అందజేశారు. అనంతరం పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ప్రముఖ పత్రిక ఎడిటర్‌తో పోలీసులు దురుసుగా ప్రవర్తించడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వ అక్రమాలు, అవినీతిని సాక్షి వెలుగులో తీసుకొస్తోందన్న అక్కసు, కక్షతో పోలీసులతో భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఈ తరహా దుశ్చర్యలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సింహాద్రి జర్నలిస్ట్ సొసైటీ అధ్యక్షుడు చింతల భాస్కరరావు, ఉపాధ్యక్షుడు చింతాడ వెంకటరమణ, ఏపీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు కోనాల సంజీవన్, సాక్షి విలేకరి కోవెల కాశీ విశ్వనాథం, జర్నలిస్టుల/ పూజారి సత్యనారాయణ, గంట్ల ప్రసాద్, డేవిడ్, పాండు వెంకటరమణ, రాజు, సాయి, మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



కిరణ్‌కుమార్ మృతదేహం

మల్కాపురం: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మల్కాపురం సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలిలా.. 58వ వార్డు శ్రీహరిపురంలో కిరణ్‌కుమార్ స్వైన్(35 భార్య, పిల్లలతో కలిసి కొంత కాలంగా నివసిస్తున్నాడు. ఒడిశా ప్రాంతానికి చెందిన ఈ వ్యక్తి ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి కొంత కాలం నుంచి ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ఇటీవల కిరణ్‌కుమార్ భార్య ఒడిశా వెళ్లింది. ఇదే సమయం అనుకున్నాడో ఏమో గానీ శుక్రవారం డ్యూటీకి వెళ్లకుండా ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. మధ్యాహ్నమైన ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో స్వైన్ ఇంటి పక్కనే ఉంటున్న అతడి అన్నయ్యకు అనుమానం వచ్చి తలుపు తట్టాడు. ఎంత సేపటికీ తీయకపోవడంతో కిటికీ నుంచి చూడగా బెడ్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేళాడుతున్న కిరణ్ కుమార్‌ను చూసి వెంటనే కుటుంబ సభ్యులకు, మల్కాపురం పోలీసులకు సమాచారం అందించాడు. ఆర్థిక ఇబ్బందులే స్వైన్ మృతికి కారణమని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

జేఎస్‌ఎస్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం: స్థానిక జన శిక్షణ సంస్థాన్(జేఎస్‌ఎస్)లో స్వల్పకాలిక సమ్మర్ క్రాష్ కోర్సులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సిహెచ్.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మర్ క్రాష్ కోర్సుల జాబితాలో భాగంగా బ్యూటీషియన్ 3 నెలలు, డ్రెస్ మేకింగ్ 3 నెలలు, అడ్వాన్స్‌డ్ టైలరింగ్ కోర్సు ఒక నెల, డీటీపీ (డెస్క్ టాప్ పబ్లిషింగ్) 3 నెలలు, ఫొటోషాప్ 3 నెలలు, ప్రీ–స్కూల్ టీచర్ ట్రైనింగ్ 6 నెలలు, స్పోకెన్ ఇంగ్లిష్ 3 నెలలు, ఎం.ఎస్. ఆఫీస్ ఒక నెల, అకౌంటింగ్ ప్యాకేజీ ఒక నెల, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ 15 రోజులు, అగరబత్తి తయారీ వారం రోజులు, జ్యూట్ బ్యాగ్‌ల తయారీ 10 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఉంటుందన్నారు. ఆయా కోర్సుల్లో శిక్షణకు ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 16లోగా పిఠాపురం కాలనీలోని జన శిక్షణ సంస్థాన్ కార్యాలయంలో అందించాలని సూచించారు. వివరాలకు 85000 54456 నంబర్‌లో సంప్రదించాలని సంస్థ డైరెక్టర్ కోరారు.

ఉపాధ్యాయుల డిమాండ్లు పరిష్కరించాలి

సబ్బవరం: త్వరలో జరగబోయే ఉపాధ్యాయుల బదిలీలు మాన్యువల్ పద్ధతిలో నిర్వహించాలని, ఏజెన్సీ ప్రాంతాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలని పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డి. గోపీనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సబ్బవరంలోని విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం తమ యూనియన్ సభ్యులతో కలిసి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అదేవిధంగా రిటైర్మెంట్‌కు మూడేళ్లలోపు సర్వీస్ ఉన్నటువంటి ఉపాధ్యాయులను బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ఉన్నత పాఠశాలలో 1:40 నిష్పత్తిలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులు ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులను తప్పనిసరిగా నియమించాలన్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్‌కు ప్రధానోపాధ్యాయులుగా సీనియర్ ఎస్‌జీటీలను పీఎస్‌హెచ్‌ఎంగా నియామకం చేయాలన్నారు. పెండింగ్ బకాయిలు సరెండర్ లీవ్, డీఏ ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి



యల్లపువానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పాల్గొన్న బాలికలు

సింథియా: బాల్య వివాహాలతో పలు అనర్థాలతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పేదరికం, బాల్య వివాహాల నిర్మూలన చట్టంపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. అన్ని స్థాయిల్లో చైతన్య, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాల్య వివాహాల సంప్రదాయానికి తెరదించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బల్ల భారతి, యశోద, ఏఎన్‌ఎం సువర్ణ, బాలికలు పాల్గొన్నారు.

యల్లపువానిపాలెంలో..

గోపాలపట్నం: బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలపై కిశోర బాలికలకు యల్లపువానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈర్ల దేవి మాట్లాడుతూ అర్బన్ ప్రాజెక్ట్ అధికారి ఎం.వి.రమణ కుమారి ఆదేశాల మేరకు ఏసీడీపీవో శ్రీలత పర్యవేక్షణలో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పేర్కొన్నామన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, కిశోర బాలికలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో 'ప్రైవేటు వ్యాపారం'!

- బయట మందులు కొనాలంటూ సిఫార్సు
- వాటినే ఆస్పత్రిలో వేస్తున్న వైనం
- రెండు దుకాణాలతో ముందస్తు ఒప్పందాలు
- గోపాలపట్నం పశు వైద్యశాలలో కమీషన్ల భాగోతం



గోపాలపట్నం ప్రాంతీయ పశు వైద్యశాల



కుక్కకు టీకా వేస్తున్న రేడియోగ్రాఫర్



బయట కొనుగోలు చేసి తీసుకొచ్చిన వ్యాక్సిన్



బయట వ్యాక్సిన్‌ను వేస్తున్న రేడియోగ్రాఫర్

విశాఖ విద్య: గోపాలపట్నం ప్రభుత్వ ప్రాంతీయ పశువుల ఆస్పత్రిలో కొంతమంది సిబ్బంది ప్రైవేటు వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పెంపుడు జంతువులను వైద్యం కోసం తీసుకొచ్చే వారిని టార్గెట్‌గా చేసుకొని, బయట దుకాణాల్లో మందులు కొనుగోలు చేయిస్తూ కమీషన్లు దండుకుంటున్నట్టు ప్రచారం సాగుతోంది. శుక్రవారం ఆస్పత్రిని 'సాక్షి' పరిశీలన చేసిన సమయంలో ఓ యువతి ఇక్కడి విధుల్లో ఉన్న సిబ్బందితో చేసిన వాదన ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది. బయట ముందుల కోసం పంపించిన కేసు, మా వద్దకు రావాల్సి ఉన్నా వేరే షాపు వారు తీసుకుపోయారని చెప్పడాన్ని బట్టి ఇక్కడ ప్రైవేటు వ్యాపారం ఏ రీతిన సాగుతుందో అవగతమవుతోంది.

ఇదీ పరిస్థితి

ఆస్పత్రికి వైద్యం కోసం తమ పెంపుడు జంతువులును తీసుకొచ్చే వారికి వ్యాధి నిరోధక వ్యాక్సిన్ వేసుకుంటే మంచిదని సలహా ఇస్తున్నారు. ఆ వ్యాక్సిన్ బయట కొనుక్కొని రావాలని సిఫార్సు చేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రాంతీయ పశువైద్యశాలలో అసిస్టెంట్ డైరక్టర్ హోదా ఉన్న డాక్టర్ రవి కుమార్ బాగా వైద్య సేవలు అందిస్తారని ఈ ప్రాంతంలో పేరుంది. పలువురు దాతల సాయంతో ఆస్పత్రిని కూడా ఎంతో అభివృద్ధి చేశారు. అయితే శుక్రవారం డాక్టర్ రవికుమార్ విధుల్లో లేని సమయంలో ఇక్కడి సిబ్బంది ఇలా వ్యవహరించడంపై ఆక్షేపణలు వెల్లువెత్తుతున్నాయి.



బయట మందుల కోసం రాసి ఇచ్చిన చీటీ

ప్రైవేటు మందుల దుకాణాల ఏజెంట్ల పాగా

గోపాలపట్నం ప్రభుత్వ పశువైద్యశాల వద్ద ప్రైవేటు మందుల దుకాణాలకు సంబంధించిన వ్యక్తులు పాగా వేస్తున్నారు. పెంపుడు జంతువులకు టీకాలు వేసే చోటుకు సమీపంలోనే ఇరువైపులా రెండు దుకాణాలకు చెందిన వ్యక్తులు వేచి ఉంటూ తమకు చీటీ వరుస ఎప్పుడు వస్తుందా..? అని ఎదురు చూస్తున్నారు. ఉచితంగా వైద్యం అందుతుందని ఆస్పత్రికి పెంపుడు జంతువులను తీసుకొస్తుండగా, వాటి యజమానుల ఆసక్తిని గమనిస్తున్న ఇక్కడి సిబ్బంది బయట వ్యాక్సిన్ వేస్తే మీ కుక్కల మరింత బాగుంటాయని చెబుతూ, వారికి చీటీలు రాసి ఇస్తున్నారనే ప్రచారం ఉంది. ప్రతీ రోజూ వచ్చిన కేసుల్లో ఆస్పత్రికి సమీపాన ఉన్న ఇద్దరు దుకాణదారులు చెరో సగం పంచుకొని, కమీషన్ ముట్టజెప్పేలా ఆస్పత్రి సిబ్బందితో ముందస్తు ఒప్పందం చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఉచిత వైద్యం ఇలాగేనా

పశు పక్షాదులకు ఉచితంగా వైద్యం అందించేందుకు ప్రభుత్వాస్పత్రి ఏర్పాటు చేశారు. అయితే మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రాంతీయ పశువైద్యశాల కావడంతో గోపాలపట్నం ఆస్పత్రికి ఎన్ఏడీ చుట్టుపక్కల నుంచి ఎక్కువగానే పెంపుడు జంతువులను తీసుకొస్తుంటారు. ఈ నేపథ్యంలోనే అవసరమైన సందర్భంలో ఆపరేషన్ నిర్వహించే క్రమంలో ఇక్కడ స్కానింగ్ యంత్రాలను కూడా సమకూర్చారు. స్కానింగ్ తీసేందుకు నియమించిన రేడియోగ్రాఫర్ పెంపుడు జంతువులకు టీకాలు వేస్తున్నారు. స్కానింగ్ యంత్రం పనిచేయడం లేదని అందుకే ఈ పనిచేస్తున్నాని రేడియో గ్రాఫర్ తెలిపాడు. వైద్య సేవలు అందించడంలో మంచి పేరున్న డాక్టర్ రవికుమార్ ఇలాంటి వాటిపై దృష్టి సారించి, కమీషన్ల వ్యవహారానికి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.